
సాక్షి
కృష్ణాజిల్లా
శుక్రవారం ॥ 4 ॥ ఏప్రిల్ ॥ 2025



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లా కావూరుకు చెందిన తుమ్మల సాయి రాఘవ్ రూ. లక్షను విరాళంగా సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనులపండువగా..

దుర్గమ్మ సన్నిధిలో చైత్రమాస వసంత నవ రాత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారికి శ్వేత, హరిత వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. –8లో▸

న్యూస్‌రీల్

'పది' మూల్యాంకనం ప్రారంభం



మచిలీపట్నంఅర్బన్: జిల్లాలో పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. మచిలీపట్నం నగరంలోని లేడియాంప్టిల్ బాలికల ఉన్నత పాఠశాలలో మూల్యాంకనానికి విద్యాధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాకు మొత్తం 1,91,627 జవాబు పత్రాలు చేరుకున్నాయి. బుధవారం సాయంత్రానికి సమాధాన పత్రాల కోడింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. అధికారులు వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. డెప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ఎం. డేవిడ్ రాజు స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంతా సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క టేబుల్ వద్ద చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు ఉంటారు. దీని నిమిత్తం సీఈలు 134, ఏఈలు 794, ఎస్ఏలు 268 మొత్తం 1,196 మంది జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టారు. జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే సుబ్బారావు మూల్యాంకనం క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. వైద్య, ఆరోగ్యపరంగా కొంత మంది ఉపాధ్యాయులకు వెసులుబాటు ఇచ్చారు. మూల్యాంకనం కేంద్రంలో ఉపాధ్యాయులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ముగిసిన 'ఇంటర్' స్పాట్

మచిలీపట్నంఅర్బన్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ముగిసింది. చివరి రోజు సంస్కృతం-2, కెమిస్ట్రీ-2, ఇంగ్లిష్-2 జవాబు పత్రాలు మూల్యాంకనం చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 15వ తేదీతో ముగియడంతో మార్చ్ 17వ తేదీన ఇంటర్మీడియెట్ (మొదటి, ద్వితీయ సంవత్సరం) మూల్యాంకనాన్ని ప్రారంభించారు. 2023-24 విద్యా సంవత్సరంలో పునర్విభజన జరిగిన జిల్లాలో తొలిసారిగా స్పాట్ క్యాంపు నిర్వహించారు. ఈ మేరకు గత ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని నోబెల్ కళాశాలలో ఇంటర్ మూల్యాంకనం నిర్వహించారు. జిల్లాకు మొత్తం 2,12,972 ఇంటర్ జవాబు పత్రాలు మూల్యాంకనం గురువారంతో ముగిసింది. ఇంటర్మీడియెట్ అధికారి సాల్మన్ రాజు క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. సమాధాన పత్రాల పోస్ట్ వాల్యుయేషన్, కన్సాలిడేటెడ్ చేసి శుక్రవారం బోర్డుకు నివేదిస్తామన్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్ ఫలితాలు విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.18 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 2.18 కోట్లను కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. ఆదిదంపతులకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ పర్యవేక్షణలో పలువురు సేవా సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. మొత్తం రూ. 2,18,00,698 నగదు, 355 గ్రాముల బంగారం, 6.374 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ పేర్కొన్నారు. కానుకల లెక్కింపు దేవదాయ శాఖ అధికారులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో కొనసాగింది.

కార్తికేయుని సేవలో డెప్యూటీ సీఈఓ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని డెప్యూటీ సీఈవో, ఈవీఎం నోడల్ ఆఫీసర్ కె. విశ్వేశ్వరరావు, పలువురు ఎన్నికల అధికారులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వీరు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ, విరూప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. వీరి వెంట మచిలీపట్నం ఆర్డీవో కె. స్వాతి, స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య, ఎస్ఐ సత్యనారాయణ, మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వో వెంకట రమణ తదితరులు ఉన్నారు.

దిగుబడులు భళా..

కొనుగోళ్లు లేక డీలా

- ప్రారంభమైన రబీ వరి కోతలు
- మార్కెట్‌కు చేరుతున్న ధాన్యం
- మద్దతు ధర కోసం అన్నదాతల అగచాట్లు

జాడ లేని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు



చలివేంద్రపాలెం సమీపంలో యంత్రంతో వరి కోత పనులు చేస్తున్న కూలీలు

కంకిపాడు: సీజన్‌లు మారుతున్నాయే తప్ప అన్నదాత కష్టాలు మాత్రం తీరటం లేదు. ఏ ఏటి కాయేడు కష్టాలు.. నష్టాలే. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే నాటికి ప్రభుత్వం రిక్త హస్తం చూపుతోంది. దీంతో సరైన మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు రైతుల పట్ల అడుగడుగునా నిర్లక్ష్యం కనబరుస్తోంది.

దిగుబడులు ఘనం..

రబీ వరి సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు విత్తనం, పైపాటు, సమగ్ర యాజమాన్య చర్యలకు రూ. 35 వేల వరకూ పెట్టి సాగు చేశారు. పంట చేతికొచ్చింది. ఎకరాకు సరాసరిన 42 నుంచి 45 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. తెగుళ్ల బెడద తగ్గటంతో దిగుబడులు ఆశించిన మేరకు లభించాయని అంటున్నారు.

చితికిపోతున్న అన్నదాత..

దిగుబడులు చూసి ఆనందించే లోపే రైతులు దళారుల చేతిలో చితికి దిగాలు చెందుతున్నారు. పంట మార్కెట్‌కు చేరుతుండటంతో దళారులు,



నూర్పిడి చేసిన ధాన్యాన్ని విజయవాడ-మచిలీపట్నం హైవేపై ఆరబోస్తున్న దృశ్యం

మిల్లర్లు పంట పొలాల్లోకి వెళ్లిపోతున్నారు. ఉన్నపళంగా కోసిన ధాన్యం కోసినట్లుగా మిల్లుకు తరలించేందుకు 75 కిలోల బస్తాకు రూ.1,250 నుంచి రూ.1,300 మాత్రమే ఇస్తామని నొక్కి మరీ పంటను తరలించుకుపోతున్నారు. కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవటంతో రైతులు కూడా చేసేది లేక దళారులకే అమ్మి సొమ్ము చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల ఊసేదీ?

వరి కోత పనులు మూడు రోజులుగా సాగుతున్నాయి. పంట మార్కెట్‌కు చేరుతోంది. అయినా ఇప్పటి వరకూ రబీ వరి కొనుగోళ్లపై ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేయలేదు. పౌరసరఫరాల సంస్థ పంట దిగుబడులు వచ్చే నాటికే రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేయటం, కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేయటం జరగలేదు. 12,285 ఎకరాల్లో వరి సాగు చేయటం ద్వారా 43,824 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనాలు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 44,521 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనాలే ఉన్నాయి. ఖరీఫ్‌లో ఏర్పడిన నష్టాన్ని అధిగమించి ఒడ్డున పడాలనే ఆశతో రైతులు అనుమతులు లేకున్నా బోర్లు సదుపాయం ఉన్న భూముల్లో వరి సాగు చేసుకున్నారు. దిగుబడులు ఘనంగా వచ్చాయి. కానీ అధికారులు, పాలకులు రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర అందించే విషయంలో వైఫల్యం చెందారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జిల్లాలో పరిస్థితి..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సాగుకు అనుమతి అధికారికంగా లేదు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని పాలకులు, అధికారులు సూచించారు. అయితే బోర్లు సదుపాయం ఉన్న రైతులు, అపరాల పంట సాగుకు అనువుగా లేని భూముల్లో రైతాంగం రబీ వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 12,285 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రధానంగా ఎంటీయూ 1156, 1153, 1121, 1010, 1061, బీపీటీ 5204, పీఆర్ 126 విత్తన రకాలను రైతులు సాగుకు ఎంచుకున్నారు. మూడు రోజులుగా జిల్లాలోని పలు చోట్ల పంట చేతికి రావటంతో వరి కోత యంత్రాలతో వరి కోత పనులను నిర్వహిస్తున్నారు.

తక్షణమే తెరవాలి..



రబీ వరి పంట చేతికొచ్చింది. ఎకరాకు రూ. 30 వేలకు పైగా పెట్టుబడులు అయ్యాయి. దిగుబడులు బాగా వచ్చాయి. ఖరీఫ్‌లో జరిగిన నష్టం నుంచి తేరుకోవాలంటే రబీలో కూడా మద్దతు ధర అందేలా పాలకులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే అన్నదాతలకు మేలు జరుగుతుంది. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.

– నకరికంటి శేఖర్, కౌలు రైతు, ఈడుపుగల్లు

సమీక్షలు జరుగుతున్నాయి..

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఇంకా సమీక్ష జరుగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లపై చర్చించాలి. పది వేల టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి సూచన ప్రాయంగా ఆదేశాలు వచ్చాయి. ఏ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవాలి అన్నదానిపై చర్చించి రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం.

– పద్మాదేవి, జిల్లా మేనేజరు, జిల్లా పౌరసరఫరాల సంస్థ

బందరుకోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కలెక్టర్ డీకే బాలాజీ



డచ్ సమాధులను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నం వారసత్వ సంపద గల చారిత్రాత్మక నగరమని, బందరు కోటను పర్యాటక సర్క్యూట్‌లో మార్చేందుకు పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల అధికారులతో కలిసి నగరంలోని బందరుకోట, డచ్ వారి సమాధులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురావస్తు శాఖ, విజయవాడ సహాయ సంచాలకులు స్వామి నాయక్ మాట్లాడుతూ బందరుకోట 17వ శతాబ్దంలోనిదన్నారు. కేంద్ర పురావస్తుశాఖ కన్సల్టెంట్ అసిస్టెంట్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మొదటి దశలో బందరు కోటలో పైకప్పు పునరుద్ధరణ, గన్ పౌడర్ మ్యాగజైన్ మరమ్మతు పనులు చేపట్టాలని అంచనాలు రూపొందించామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకు బందరు కోటను సందర్శించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించినప్పటికీ ఏమాత్రం పనులు జరగలేదని.. ఇకనైనా ఈ విషయం తీవ్రంగా పరిగణించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే ఢిల్లీలోని పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడతామని చెప్పారు. కలెక్టర్ వెంట కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఉప పర్యవేక్షకుడు ఎంఎస్ శివకుమార్, రాష్ట్ర పురావస్తు శాఖ ఉపసంచాలకులు సురేష్, జిల్లా పర్యాటక అధికారి రామ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ బిడ్డా అనాథగా మిగిలిపోకూడదు

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



దత్తత పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో జేసీ, డీఆర్వో

చిలకలపూడి(మచిలీపట్నం): అనాథ పిల్లలను దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్న దంపతులు ఎంతో మందికి ఆదర్శనీయులని, ఏ బిడ్డా అనాథగా మిగిలిపోకూడదని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె. చంద్రశేఖరరావుతో కలిసి జిల్లాలోని వివిధ శిశుగృహాల్లో ఉంటున్న ముగ్గురు చిన్నారులను కారా (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) ద్వారా జిల్లా బాలల రక్షణ విభాగం (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు జంటలకు దత్తత ఇచ్చి పత్రాలను అందించారు. మచిలీపట్నం శిశు గృహ నుంచి హిమాన్షు అనే ఏడు నెలల బాబుని చిత్తూరు జిల్లాకు చెందిన పీఎస్ ప్రసాద్ సుజాత దంపతులకు, బుద్ధవరం శిశు గృహ నుంచి రెండున్నర సంవత్సరం వయసున్న పాపని హైదరాబాద్‌కు చెందిన వికాస్ పంక్వని మనీషా దంపతులకు, అదేవిధంగా నాలుగేళ్ల సుశాంత్ అనే బాలుడిని బెంగళూరుకు చెందిన కృష్ణా నందిని దంపతులకు కారా ద్వారా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులను బాగా చూసుకొని, మంచిగా చదివించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలని దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా విహంగామా



వెంకటాపురంలో ఎర్రకాళ్ల కొంగల కోలాహలం

పెనుగంచిప్రోలు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎక్కడ చూసినా కొంగల కోలాహలం కనపడుతోంది. వందల సంఖ్యలో వచ్చిన పెయింటెడ్ స్టార్క్స్ నేడు సంతానోత్పత్తి ద్వారా వేల సంఖ్యకు చేరాయి. వీటి అరుపులు, ఇవి చేసే ధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోతోంది. గ్రామస్తులు ఏమాత్రం విసుక్కోకుండా, ఓపికగా వాటిని కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం గూళ్లల్లో పిల్లలను చేసి వాటిని సంరక్షించుకుంటున్నాయి.

వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి..

ఏటా వెంకటాపురం గ్రామానికి ఆస్ట్రేలియా నుంచి పెయింటెడ్ స్టార్క్స్(ఎర్రకాళ్ల కొంగలు) డిసెంబర్‌లో వచ్చి విడిది చేస్తాయి. వందల సంఖ్యలో వచ్చే పక్షులు సంతానోత్పత్తి తరువాత జూన్‌లో వాటి స్వస్థలాలకు వెళ్తుంటాయి.

కలిసి వస్తున్న నీటి వనరులు...

పక్షులు ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులతో



గతంలో అనేకం మృత్యువాత పడేవి. కుంటల్లో, చెరువుల్లో, పక్కనే ఉన్న మునేరులో కూడా నీరు లేక ఆహారం కూడా దొరకక అనేక ఇబ్బందులు పడేవి. అయితే గత రెండు మూడేళ్లుగా మునేరులో, నీటి కుంటలో, చెరువులలో కూడా నీరు పుష్కలంగా ఉండటంతో పక్షుల ఆవాసానికి ఉపయోగకరంగా ఉన్నాయి. ఆహారానికి అవసరమైన చేపలు చెరువుల్లో, మునేరులో ఉండటంతో పక్షులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాయి.

సహకారం ఇక డిజిటల్

- అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు
- అవినీతి, అక్రమాలకు చెక్
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన ప్రక్రియ

పూర్తయిన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ



నేషనల్ బ్యాంక్ తరహాలో రూపుదిద్దుకున్న తిరువూరు సహకార సంఘం లోపలి భాగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైతులకు తెలియకుండా వారి పేరుతో రుణాలు తీసుకోవడం, తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు వసూలు చేయడం, అప్పు తీర్చినా కొన్నేళ్ల తర్వాత రైతులకు నోటీసులు ఇచ్చి మరలా రుణాల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం ఇలాంటివన్నీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో నిత్యకృత్యం. రాజకీయ జోక్యంతో రికార్డులు తారు మారు చేయడం, సభ్యుల వివరాలు గల్లంతు చేయడం వంటివి జరిగేవి. ఇదంతా ఇపుడు గతం. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. పీఏసీఎస్‌ల ద్వారా పారదర్శకంగా, అవినీతి రహితంగా రైతులకు సేవలు అందించేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ పూర్తయింది. పీఏసీఎస్‌లన్నీ మాన్యువల్ విధానానికి స్వస్తి పలికి కంప్యూటర్ ఆధారిత సేవలు అందించనున్నాయి. బ్యాంకుల తరహాలో రైతులకు పూర్తి పారదర్శకంగా సేవలు అందిస్తాయి. ఇకపై రైతులు పీఏసీఎస్‌ల ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందవచ్చు.

జిల్లాలో పరిస్థితి..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 131 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతులకు సేవలు అందిస్తున్నాయి. వీటి ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు అందుతున్నాయి. ఇవి గాక రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సొసైటీలు అందిస్తున్నాయి. వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి పీఏసీఎల్‌లలో సేవలను మాన్యువల్ విధానంలో అందిస్తున్నాయి. గతంలో సొసైటీలు అవకతవకలు అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉండేవి. సొసైటీల్లో అధ్యక్షులుగా ఎన్నికైన కొందరు అక్రమాలకు పాల్పడడం, రైతుల సొమ్ము కాజేయడం వంటి అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. 2004కి ముందు సహకార సొసైటీలు దివాలా తీశాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం సొసైటీలకు జీవం పోసింది.

గత ప్రభుత్వంలో కీలక అడుగులు..

సొసైటీలను డీసీసీబీలు, ఎస్‌సీబీలకు అనుసంధానం చేయడం, రైతులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కంప్యూటరీకరణ చేపట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరంలో ముగిసింది. ప్రస్తుతం సొసైటీలు పూర్తిగా కంప్యూటర్ ఆధారిత సేవలు, పారదర్శకంగా అందించేందుకు సిద్ధమయ్యాయి.

అక్రమాలకు అడ్డుకట్ట..

కంప్యూటరీకరణలో భాగంగా ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రైతుల వివరాలు, వారి డిపాజిట్లు, రుణాలు, ఏ భూములపై రుణాలు తీసుకున్నారన్న వివరాలను పూర్తి స్థాయిలో సేకరించారు. శాస్త్రీయ పద్ధతిలో రైతుల వివరాలు అప్‌డేట్ చేశారు. డేటా పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. సహకార సంఘాలు అన్ని శాఖలు, డీసీసీబీలు, ఆప్కాబ్, నాబార్డుకు అనుసంధానిస్తారు. రైతులు సొసైటీల ద్వారా తీసుకున్న, చెల్లించిన రుణాల వివరాలు, వాటిపై వడ్డీ చెల్లింపులు పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. జవాబుదారీతనం పెరుగుతోంది. రికార్డుల నిర్వహణ కచ్చితంగా జరగడమే కాకుండా, అవినీతికి చెక్ పడుతుంది.

మూడు దశల్లో కంప్యూటరీకరణ..

సహకార సంఘాల కంప్యూటరీకరణ మూడు దశల్లో చేపట్టారు. జిల్లాలోని 131 సహకార సంఘాల్లో మొదటి రెండు దశలు వంద శాతం పూర్తయ్యాయి. ఇక చివరిది ప్యార్లల్ రన్ ద్వారా 92 సంఘాల్లో పూర్తయింది. మరో రెండు రోజుల్లో మిగిలిన సంఘాల్లో పూర్తవుతుంది. కంప్యూటర్ ఆధారంగానే రైతులకు సేవలు అందించనున్నాయి.

– శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార అధికారి

ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టండి

కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృష్ణా జిల్లా డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెమీ మెకనైజ్డ్ విధానంలో యంత్రాలతో ఇసుక తవ్వకాల కోసం పర్యావరణ అనుమతులు పొందామన్నారు. పమిడిముక్కల మండలంలోని పడమటలంక, పెనమలూరు మండలంలోని చోడవరం, తోట్లవల్లూరు మండలంలోని నార్త్‌వల్లూరు, రొయ్యూరు వంటి నాలుగు కొత్త రీచ్‌లను ఎంపిక చేశామన్నారు. వీటన్నింటికి త్వరితగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఇసుక తవ్వకాలను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సెమీ మెకనైజ్డ్ విధానం ద్వారా వినియోగదారులకు సమృద్ధిగా నాణ్యమైన ఇసుక లభించటంతో పాటు ధరలు తగ్గుతాయన్నారు. రానున్న వర్షాకాలంలో నిర్మాణ అవసరాలకు ఇసుక కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక స్టాక్ యార్డుల్లో సమృద్ధిగా నిల్వలు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ ఏడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ కొండారెడ్డి, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగాభవానీకి 'లక్ష' గారెలతో మహానివేదన



కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారికి 'లక్ష' గారెలతో మహానివేదన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి 50వ జాతరోత్సవాల నేపథ్యంలో గురువారం గారెలతో మహానివేదన జరిపారు. కోడూరు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు తమ ఇళ్ల వద్ద నుంచి గారెలను వండి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఒక్కో మహిళ 54 లేదా 108 గారెలను తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. గంగాభవానీ చిన్నఅమ్మవారి విగ్రహం ముందు గారెలను రాశిగా పోసి పండితులు కొమ్మూరి శ్రీనివాసరావు పూజలు చేశారు. జాతరకు వచ్చిన గ్రామ ఆడపడుచులు, మహిళలు ప్రతి ఒకరూ కార్యక్రమంలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. మహానివేదన అనంతరం గారెలను ప్ర సాదంగా భక్తులకు అందజేశారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.13.90 లక్షల ఆదాయం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ వారి ఆలయంలో బహిరంగ వేలం ద్వారా రూ.13.90 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు. ఆలయ బేడా మండపంలో గురువారం జరిగిన వేలంలో ఆలయం వద్ద ఏడాది పాటు భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరుచు లైసెన్స్ హక్కుకు రూ.13.90 లక్షలకు(కాకాని రవి బాబు) పాడుకున్నారు. ఈఈ రమ, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, ఏఈఓ ఉమాపతి పాల్గొన్నారు.

రేపు సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ పరీక్ష ఈ నెల ఐదో తేదీన నగరంలో నిర్వహించనున్నట్లు విజయవాడ కేంద్రం కోఆర్డినేటర్ జి.బర్నబస్ తెలిపారు. విజయవాడలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చిట్టూరి హైస్కూల్ ప్రాంగణాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 973 మంది ఆరో తరగతి ప్రవేశ పరీక్ష విద్యార్థులు, 393 మంది తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకూ, తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోందన్నారు. ప్రతి కేంద్రానికి ఇద్దరు పరిశీలకులను ఆ శాఖ నియమించిందని, వారి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

బాల్యం బడికి దూరం

- ఉన్నత పాఠశాల విద్యార్థులే అధికంగా బడికి దూరం
- ఆర్థిక అంశాలతో డ్రాప్‌ఔట్స్ ప్రభావితం
- గతంలో అమ్మఒడితో తగ్గిన డ్రాపౌట్స్
- అర్బన్ ప్రాంతాల్లోనే అధికంగా బడి మానేస్తున్న విద్యార్థులు



పామర్రులో విద్యార్థి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు(ఫైల్)

మచిలీపట్నంఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ స్కూళ్లలో మధ్యలో బడికి దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ విద్యను మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ విద్యార్థుల డ్రాపౌట్స్‌ను మాత్రం తగ్గించలేకపోతోంది. 2024-25 విద్యా సంవత్సరంలో మార్చి 19వ తేదీ వరకు డ్రాపౌట్స్(పెండింగ్) అత్యధికంగా మచిలీపట్నం డివిజన్‌లో 184 మంది బడికి దూరమవ్వగా ఉయ్యూరు డివిజన్ 84, గుడివాడ డివిజన్ 49 మంది ఉన్నారు. అత్యధికంగా 71 మంది మచిలీపట్నం మండలం నుంచి డ్రాపౌట్స్ అయ్యారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు ఎక్కువగా మానేస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివేవారు అంతా పేదలే. ఆర్థిక పరిస్థితుల కారణంగా మధ్యలోనే తల్లిదండ్రులు పిల్లలను స్కూల్స్ మాన్పిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థి తల్లికి ఆర్థిక సాయం తల్లికి వందనం అందని కారణంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి.

గత ప్రభుత్వ హయంలో..

గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల చర్యలకు చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంతో డ్రాపౌట్స్ తగ్గాయి. దీనికి తోడు పాఠశాల విద్యపై బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉండేది. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు సంఖ్య గణనీయంగా పెరిగింది. అప్పుడు మౌలిక సదుపాయాల కల్పనతో చెప్పుకోదగిన అభివృద్ధి కనిపించింది. విద్యా కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీకి యాక్సెస్, బ్రిడ్జ్ కోర్సులు, అకడమిక్ లోటులను పరిష్కరించటంతో డ్రాపౌట్స్ తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టడంతో పాటు వారికి నూతన విధానంలో విద్యా బోధన చేయటంతో విద్యార్థులు పాఠశాలలు మానేసే ప్రక్రియ చాలా వరకు తగ్గించారు.

మధ్యలోనే మానేస్తున్నారు..

2023-24లో జిల్లాలో బడి పిల్లల డ్రాపౌట్స్ 372 కాగా 2024-25లో మార్చి 19 వరకు 386కు చేరింది. ఈ ఏడాది 3.76 శాతం జిల్లా వ్యాప్తంగా అనూహ్యంగా పెరిగింది. ఈ పరిస్థితిని మార్చడానికి గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి ప్రవేశపెట్టి తల్లిదండ్రులకు ఆర్థిక వెసులుబాటు కల్పించింది. డ్రాపౌట్స్‌ను చాలావరకు తగ్గించింది. ప్రాథమిక స్థాయిలో కొంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఉన్నత పాఠశాల 10వ తరగతి స్థాయికి వచ్చేసరికి చాలామంది విద్యార్థులు బడి మానేస్తున్నారు. ప్రధానంగా అర్బన్ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉన్నాయి. అసలు ఈ డ్రాపౌట్స్ సమస్య ముఖ్యంగా ఆర్థిక అంశాలతో ప్రభావితమై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా తల్లికి వందనం ఇవ్వకపోవడం, పాఠశాలల్లో నేర్చుకునే విద్యలో లోటుపాట్లు, అకడమిక్ సవాళ్లు డ్రాపౌట్స్‌కు కారణమవుతున్నాయి.

అన్ని చర్యలు తీసుకుంటాం..



బడిఈడు పిల్లలను ఇప్పటికే ఆయా మండలాల్లో టీమ్‌లుగా ఏర్పాటు చేసి గుర్తించటం జరిగింది. వారిని రాబోయే విద్యా సంవత్సరానికి బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. జూన్ నెలలో ఇందు కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.ఫణి దూర్జటి, ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సమగ్ర శిక్షా

100 అడుగుల రోడ్డులో కారు బీభత్సం



బీభత్సం సృష్టించిన కారు



విరిగిపడిన సెంట్రల్ లైటింగ్ స్తంభం

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో బుధవారం రాత్రి కారు బీభత్సం సృష్టించింది. ఎనికేపాడు నుంచి తాడిగడప జంక్షన్ వైపునకు అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి డివైడర్‌పై నుంచి దూసుకెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి పంట బోదెలో పడింది. డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభం విరిగి రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో రహదారిపై ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుపై ఎవరైనా ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. ఘటనపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ వెంకటరమణ తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభం అలానే ఉంది.

కిడ్నాప్ కలకలం..

పోరంకిలో బుధవారం రాత్రి కిడ్నాప్ కలకలం చెలరేగింది. తన తండ్రిని కొందరు ఇంటి వద్ద నుంచి కిడ్నాప్ చేశారని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. వ్యాపారంలో ఆర్థిక లావాదేవీల కారణంగానే పోరంకిలో ఉంటున్న వెంకటేశ్వరరావును వ్యాపార పార్టనర్ రాజు అనే వ్యక్తి కిడ్నాప్ చేశాడని ఆమె తెలిపింది. ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు చేయలేదని సీఐ వెంకటరమణ తెలిపారు. ఈ ఘటనలో ఇరువురు రాజీ పడినట్లు సమాచారం.

రైలులో గంజాయి తరలిస్తున్న నిందితుడి అరెస్ట్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీఆర్పీ సిబ్బంది గురువారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 1వ నంబర్ ప్లాట్‌ఫాం దక్షిణం వైపు చివరలో ఒక యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా అందులో ఏడు కేజీల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అంబాపురానికి చెందిన సందునపల్లి రాంబాబుగా గుర్తించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి వాటిని చిన్న పొట్లాలుగా కట్టి నగరంలో అధిక ధరకు విక్రయిస్తుంటాడు. ఒడిశాలోని గంజాం జిల్లాలో చందు అనే వ్యక్తి నుంచి రాంబాబు గంజాయి కొనుగోలు చేసి రైలులో విజయవాడ చేరుకోగా రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాంబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పెట్రోల్ బంక్ సీజ్

నందిగామరూరల్: మండలంలోని అడవిరావులపాడు గ్రామ సమీపంలోని నయారా పెట్రోల్, డీజిల్ బంకును తూనికలు, కొలతల శాఖాధికారులు సీజ్ చేశారు. పెట్రోల్, డీజిల్ రీడింగ్‌లు, కొలతల్లో తేడాలున్నాయని వినియోగదారులు గురువారం బంకు వద్ద ఆందోళన చేశారు. మూడు నెలల నుంచి కొలతల్లో తేడాలను గమనిస్తున్నామని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ డీజిల్ మోటార్ పంపు ఆన్ చేయగా డీజిల్ రీడింగ్ హెచ్చుతగ్గులు చూపిస్తోందన్నారు. దీంతో క్షుణ్ణంగా తనిఖీ చేయగా మోటర్ జంప్ టెక్నిక్‌ను గుర్తించామన్నారు. దీంతో బంక్ సీజ్ చేశామని చెప్పారు. పీడీఎస్ డీటీ రామ్మూర్తి రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని యువకుడి మృతి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ – ఏలూరు మధ్య మూడో లైన్‌లో గుర్తు తెలియని యువకుడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు వివరాలు సేకరించారు. మృతుడి వయసు 30 సంవత్సరాలు ఉంటాయని, సిమెంట్ రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతిపై 'అమ్మ' అనే పచ్చ బొట్టు ఉందని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. ఒంటిపై అనేక చోట్ల గాయాలు ఉండటంతో ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ స్టేషన్ లేదా 88971 56153, 94406 27544 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

లారీ కింద పడి ప్రాణాలతో బయటపడిన యువకుడు



పెనమలూరు: పోరంకి సెంటర్‌లో గురువారం యువకుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అనకాపల్లికి చెందిన సింగంపల్లి గోవిందు పని కోసం పోరంకికి వచ్చాడు. అతను పోరంకి సెంటర్‌లో బైక్‌పై డివైడర్ కటింగ్ వద్ద రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న టిప్పర్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌తో పాటు గోవిందు లారీ కిందకు వెళ్లాడు. ఒక్కసారిగా అందరూ గోవిందు ప్రాణాలకు ముప్పు జరిగిందని భావించారు. అయితే అతను లారీ మధ్యలో ఉండటంతో లారీ చక్రాలు అతని పైకి ఎక్కలేదు. అతను సురక్షితంగా లారీ కింద నుంచి బయటకు వచ్చాడు. స్వల్ప గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



పమిడిముక్కల: విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై గురజాడ బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన చాగంటిపాటి వీరభద్రరావు(82) గురజాడ వెళ్తుండగా, ఉయ్యూరు నుంచి మచిలీపట్నం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరభద్రరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే సీఐ చిట్టిబాబు, ఏఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చిట్టిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గుడ్లవల్లేరు మండలం కూరాడ గ్రామానికి చెందిన వలిశెట్టి వనాజీ(50) సిద్ధాంతం గ్రామ పరిధిలోని పెట్రోల్ బంక్‌లో ఆటోలో ఆయిల్ కొట్టించుకుని నలుగురి ప్రయాణికులతో గుడివాడ వైపు వస్తుండగా గుడ్లవల్లేరు వైపు నుంచి వస్తున్న మరొక ప్యాసింజర్ ఆటో ఢీ కొంది. దీంతో సదరు ఆటో పల్టీకొట్టగా ఆటోడ్రైవర్ వనాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, వాహనదారులు గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆటోలోని నలుగురు ప్రయాణికుల్లో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారికి ఎటువంటి గాయాలు కాలేదు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

గన్నవరం: కృష్ణాజిల్లా ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన స్థల వివాదం కేసులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై స్థానిక 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం వాదనలు పూర్తయ్యాయి. ఉంగుటూరులోని ఓ స్థలం వివాదంపై తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్కూరు పీఎస్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 24న కేసు నమోదైంది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న వంశీమోహన్‌ను పీటీ వారెంట్‌పై ఆత్కూరు పోలీసులు ఇటీవల స్థానిక కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ నేపథ్యంలో వంశీమోహన్ బెయిల్‌పై దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టులో గురువారం తుది విచారణ జరిగింది. ఇరువైపులా న్యాయవాదుల సుదీర్ఘ వాదనలు విన్న జడ్జి బి.శిరీష తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేశారు.

మంగినపూడి బీచ్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



బీచ్‌ను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంరూరల్: మంగినపూడి బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం రాత్రి మంత్రి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ డీకే బాలాజీలతో కలిసి మంగినపూడి బీచ్‌ను పరిశీలించారు. అక్కడి ఆహ్లాదకర వాతావరణాన్ని గమనించిన ముఖ్య కార్యదర్శి బీచ్ అభివృద్ధికి ఎంతో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతికి, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు, భీమవరం, రేపల్లె, గుంటూరు తదితర ప్రాంతాలకు మంగినపూడి బీచ్ దగ్గరగా ఉందన్నారు. ఈ బీచ్ సురక్షితమైనదే కాకుండా ఇక్కడ 200 ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉందని, అందులో ఇప్పటికే 150 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. మిగిలిన 50 ఎకరాల భూమిని కూడా గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పీపీపీ పద్ధతిలో అభివృద్ధి..

పీపీపీ పద్ధతిలో స్వదేశీ దర్శన్ పథకం కింద బీచ్‌లో రిసార్టులు, హోటళ్లు తదితర అభివృద్ధి పనులు చేసేందుకు రూ.108 కోట్ల నుంచి రూ. 150 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ఆ మేరకు సమగ్ర ప్రణాళికతో ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధం చేశామన్నారు. మే 15వ తేదీ నుంచి బీచ్ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కియా కింగ్, బీచ్ కబడ్డీ జాతీయ క్రీడలను కూడా ఈసారి మంగినపూడి బీచ్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు వై.వి.ప్రసన్నలక్ష్మి, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, ఆర్డీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రిపై కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని ఉపాలయం నుంచి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీపై ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నా, వీక్షించినా భక్తుల ఇంట సకల శుభాలు కలుగుతాయని, సంతానం లేని వారికి సంతాన యోగం, వివాహం కాని వారికి వివాహ యోగం కలుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఉభయ దాతలకు ప్రత్యేక క్యూ మార్గం ద్వారా ఆది దంపతుల దర్శనానికి అనుమతించారు.

కనులపండువగా వసంత నవరాత్రోత్సవాలు



అమ్మవారికి విశేష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారి అర్చనకు సిద్ధంగా ఉంచిన పూలు

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం అమ్మవారికి శ్వేత(తెలుపు), హరిత(పచ్చ) వర్ణ పుష్పాలతో విశేషంగా అర్చన జరిగింది. అమ్మవారికి తెల్ల జిల్లేడు, మల్లె పూలు, మారేడు బిల్వ పత్రాలు, తులసీ దళాలు, మందార పుష్పాలతో అర్చన నిర్వహించారు. తొలుత ఆలయ ఈఓ కె.రామచంద్రమోహన్, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఇతర అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలను ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు సమర్పించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పూజా మండపానికి చేరుకున్నారు. పూజా మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆయా పుష్పాలతో అర్చన నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర



యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు

మచిలీపట్నంఅర్బన్: ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రవేశపెట్టిన సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతుందని స్టేషన్ మేనేజర్ ఎస్.పోతురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్పెషల్ టూరిస్ట్ ట్రైన్ ప్యాకేజీలో భాగంగా ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, పూర్ణలో బోర్డింగ్, డే బోర్డింగ్ చేసే సౌకర్యం ఉందన్నారు. విజయవాడలో 8వ తేదీ రాత్రి 9 గంటలకు బయలుదేరి ఉజ్జయిని(మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర), ద్వారక(నాగేశ్వర్), సోమ్‌నాథ్, పూణే (భీమశంకర్), నాసిక్ (త్రాయంబకేశ్వర్), ఔరంగాబాద్(గ్రీష్ణేశ్వర్) జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని 19వ తేదీ సాయంత్రం 4 గంటలకు రైలు విజయవాడ చేరుకుంటున్నారు. ట్రైన్ జర్నీ, నైట్ స్టే, అల్పాహారం, వెజిటేరియన్ భోజనం, వాష్ అండ్ చేంజ్, ట్రాన్స్‌పోర్టేషన్ అన్నీ ఒకే ప్యాకేజీలో అందుతాయన్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌కు www.irctctourism.com సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు చేరువ చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వాటి లబ్ధిని వారికి చేరువ చేసేలా అధికారులు కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగంపై గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు విద్యకు ప్రాధాన్యతను ఇస్తూ ప్రజల సంక్షేమాభివృద్ధికి ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా పప్పు, బియ్యం, మినీ యంత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు జిల్లాకు ఎక్కువ మొత్తంలో యూనిట్లు మంజూరు చేసే విధంగా వ్యవసాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాలన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఆక్వా ల్యాబ్ ఏర్పాటు..

గుడివాడలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ బాలాజీ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొబైల్ భూసార పరీక్షలకు అవసరమైన వాహనాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ధాన్యం ఆరబెట్టే యంత్రాల కొనుగోలుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వాటిని జిల్లాకు వెంటనే అందించేందుకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తేనెటీగల పెంపకంపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై ఆసక్తి ఉన్న వారికి అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. అవనిగడ్డలో 39 మంది లబ్ధిదారులకు తేనెటీగల పెంపకం కిట్లను అందించామని తోట్లవల్లూరులో ఇటీవల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఆక్వా ల్యాబ్ ఏర్పాటుకు యూనివర్సిటీ అధికారులు సంసిద్ధంగా ఉన్నారని మత్స్యశాఖ అధికారులు వారితో సమన్వయం చేసుకుంటూ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ పథకాల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో మత్స్యశాఖ జిల్లా అధికారి నాగబాబు, వ్యవసాయశాఖ డీడీ మనోహరరావు, పశుసంవర్ధకశాఖ అధికారి చినసరసింహులు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ విజయలక్ష్మి, కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.ఉష, బయో సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ వై.మారుతీ తదితరులు పాల్గొన్నారు.